క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



కేటీదొడ్డి: మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో ఫుట్‌వేర్ దుకాణం దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి శనివారం బాధితురాలు అబేదాబేగం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేలు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డీటీ శివశంకర్, ఎంపీడీఓ కృష్ణమోహన్ దుకాణాన్ని పరిశీలించి పంచానామా నిర్వహించారు.

సఖీ వన్‌స్టాప్ సేవలపై అవగాహన



గద్వాల న్యూటౌన్: స్థానిక పీఎంకేకే కేంద్రంలో శనివారం సఖీ వన్‌స్టాప్ కేంద్రం అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సహాయం, మానసిక, సామాజిక కౌన్సెలింగ్, వైద్య సహాయం, అత్యవసర ఆశ్రయం, పోలీసుల సహకారం, 181, మహిళా హక్కులపై గురించి వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మేనేజర్ అనిమిరెడ్డి, ఇన్‌చార్జ్ శోభారాణి, స్వాతి, జుబేర్, కానిస్టేబుల్ మంజుల తదితరులు పాల్గొన్నారు

పేకాటరాయుళ్ల అరెస్టు

కేటీదొడ్డి: పేకాట స్థావరంపై దాడి చేసి ఇరువురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని ఈర్లబండ శివారులోని పేకాట ఆడుతున్నారన్నా సమాచారం మేరకు శనివారం దాడి చేశామన్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా నలుగురు పేకాటరాయుళ్లు పరారయ్యారన్నారు. వారి నుంచి రూ.5,600 నగదు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ పరిశీలకుల రాక

గద్వాల: జిల్లా కమిటీల ఏర్పాటు క్రమంలో అభిప్రాయ సేకరణకు నాయకులు దీపక్‌జాన్, వెంకటేష్ ముదిరాజ్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక పరిశీలకులుగా నియమించింది. ఈ క్రమంలో వారు జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులతో అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు జిల్లా ఓబీసీ నల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు



ధరూరు: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. గద్వాల– రాయచూర్ వెళ్లే రోడ్డులో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, సిబ్బంది గురునాథ్, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిన్‌కోడ్‌కు నోచుకోని పోస్టాఫీస్

- శాంతినగర్ కేంద్రంగా గతంలో సబ్ పోస్టాఫీస్ సేవలు
- ప్రస్తుతం బ్రాంచి పోస్టాఫీస్‌గా మార్చిన వైనం
- అందుబాటులో లేని పోస్టల్, పార్సిల్ సేవలు
- సేవలు పునఃరుద్ధరించాలంటున్న పట్టణ వాసులు



శాంతినగర్‌లో సేవలందిస్తున్న బ్రాంచి పోస్టాఫీస్

శాంతినగర్: పట్టణంలో ఫోన్ సౌకర్యం లేని రోజుల్లో బంధువులకు, తెలిసిన వారికి టెలిగ్రాం పంపాలన్నా, రిజిస్టర్ పోస్ట్ చేయాలన్నా గుర్తుకు వచ్చేది శాంతినగర్ సబ్ పోస్టాఫీస్ మాత్రమే. ప్రస్తుతం సబ్ పోస్టాఫీస్‌ను బ్రాంచి పోస్టాఫీస్‌గా మార్చడంతో ఉనికి కోల్పోవడమేగాక పూర్వం లభించిన సేవలందక ఇబ్బందులకు గురువుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. అంతేగాక పిన్‌కోడ్ నంబర్ కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

నిత్యం వ్యయ ప్రయాసలు..

గతంలో రాజోళి మండల ప్రజలు శాంతినగర్‌కు వచ్చి పోస్టల్ సేవలు వినియోగించుకున్నారు. 2014 నుంచి సబ్ పోస్టాఫీస్‌ను బ్రాంచి పోస్టాఫీస్‌గా మార్చడంతో వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల ప్రజలు రాజోళికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయని వాపోతున్నారు. అంతేగాక పిన్‌కోడ్ నంబర్ రాజోళికి మార్చడంతో ఏవైనా ఉత్తరాలు, రిజిస్టర్ పోస్టులు, బ్యాంకింగ్ లావాదేవీలు, పార్సిళ్ల సేవలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పోస్టల్ సేవలు కూడా ఆలస్యమై ఇబ్బందులకు గురవుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేయింగ్ మిషన్ లేని దుస్థితి..

పోస్టాఫీస్ నుంచి పార్సిల్ పంపాలంటే తూకం వేసి పంపాలి కనీసం వేయింగ్ మిషన్ కూడా లేకపోవడంతో పార్సిల్‌లు పంపలేని పరిస్థితి ఉంది. గతంలో ఈడీ సబ్ పోస్టాఫీసుగా ఉన్న సమయంలో అన్ని పార్సిల్‌లు శాంతినగర్ పోస్టాఫీసు నుంచే పంపేవారమని, రాజోళికి మార్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అధికారుల మండిపడుతున్నారు.

ప్రైవేట్ కంపెనీల దోపిడీ..

ప్రభుత్వ పోస్టాఫీస్‌లో సరైన సౌకర్యాలు లేక ప్రైవేట్ పార్సిల్ సర్వీసులను ఆశ్రయించాల్సి వస్తోందని దీంతో వారు ఇష్టమొచ్చినట్లు చార్జీలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు.

రాజోళిలోని సబ్ పోస్టాఫీసును గాని, ఉప్పల్ క్యాంపులోని ఈడీ పోస్టాఫీసును గాని శాంతినగర్‌కు మార్చాలని కోరుతున్నారు.

పార్సిళ్లు పంపలేక పోతున్నాం



శాంతినగర్ పోస్టాఫీసును బ్రాంచిగా మార్చడంతో పోస్టాఫీసు నుంచి పార్సిల్‌లు పంపలేకపోతున్నాం. రాజోళికి అదనంగా 10 కిలోమీటర్లు ప్రయాణించి పంపాల్సి వస్తోంది. మున్సిపాలిటీ కేంద్రం వదిలి, మారుమూలన ఉన్న రాజోళికి మార్చి ఇబ్బందులు కలుగజేస్తున్నారు.

\- ఛాణేశ్వర్‌రెడ్డి, జిల్లెడుదిన్నె, వడ్డేపల్లి

సేవలు ఆలస్యం



ఉద్యోగాలకు సంబంధించిన రిజిస్టర్ పోస్టులు రాజోళి పోస్టాఫీస్‌కు వెళ్లి తిరిగి శాంతినగర్‌కు వస్తున్నాయి. దీంతో మూడు నాలుగు రోజులు ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలో పలువురు ఉద్యోగాల్లో కూడా చేరలేని పరిస్థితి ఏర్పడింది. శాంతినగర్ పట్టణంలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలి.

-శ్రీనివాసులు, శాంతినగర్, వడ్డేపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న మహిళా సాధికారత కేంద్రం నిర్వాహకులు

మల్దకల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం నిర్వాహకులు సరోజ, చిట్టెమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో బాలలతో పొలం పనులు చేయించడం నేరమన్నారు. అదే విధంగా బాల్యవివాహాలు, లైంగిక, వరకట్న వేధింపులు వంటి అంశాలపై వివరించారు. బాలల ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ, సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుష్మ హోమం



గద్వాల న్యూటౌన్: స్థానిక భీంనగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయంలో శనివారం పట్టణానికి చెందిన చౌక్‌నీస్ వెంకట్రావ్, చౌక్‌నీస్ కమలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితులు ఆయుష్ హోమం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ఆలయాల అర్చకులు, పండితులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ భీసేంన్‌రావ్, అర్చకులు మణూర్ ప్రహ్లాదాచార్య, మణూర్ ప్రసన్నాచార్య, ప్రమోదచార్య, భీమసేనాచార్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానించిన గ్రామస్తులు



అయిజలో విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు



ఎర్సందొడ్డిలో విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కేటీదొడ్డి: మండలంలోని ఎర్సందొడ్డి గ్రామంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన హేమలతకు దాత గోవిందు రూ.1016, రెండో స్థానంలో నిలిచిన అనితకు దాత పెద్ద గురుస్వామి రూ.516, మూడో స్థానంలో నిలిచిన మల్లికకు దాత దేవప్ప రూ.216, నాల్గవ స్థానంలో నిలిచిన గురుపాదకు దాత డబ్బ రామకృష్ణ రూ.116 అందజేశారు. అదే విధంగా ప్రతి ఒక్కరికి ఇంగ్లిష్ డిక్షనరీలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈసందర్భంగా ఎంజేపీటీబీసీ(బాలురు)కి చెందిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు శనివారం మండల కేంద్రంలోని వారి ఇళ్ల వద్ద విద్యార్థులు ఆంజనేయులు, మునిస్వామి, మోక్షగ్నను సత్కరించారు. 500 వందలకు పైగా మార్కులు సాధించిన నేపథ్యంలో అభినందనలు తెలియజేశారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

అమరచింత: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ కార్మిక పక్షాన పోరాటాలు చేయడానికి సీపీఎం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి జీఎస్ గోపి అన్నారు. 139వ మే డేను పురస్కరించుకుని మండల పరిధిలోని పాంరెడ్డిపల్లిలో శనివారం సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే కేవలం సెలవు దినం కాదని, కార్మికుల శ్రమ గౌరవాన్ని ఐక్యతను సామాజిక న్యాయాన్ని గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ఆర్ఎస్ రమేష్, మోహన్, రాజు, చంటి, నాగరాజు, అశోక్, శివకాంత్, తరుణ్, బాలకృష్ణ, చంద్రాయుడు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన



బీచుపల్లిలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టాల్ ఏర్పాటు చేసి ఆలయానికి వచ్చే భక్తులు, గ్రామస్తులకు చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఫోనిక్ రవి మాట్లాడారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, హెల్ప్‌లైన్ నంబర్ 1098 గురించి తెలియజేశారు. చిన్నారులు భిక్షాటన చేస్తున్నా, తల్లిదండ్రులు లేని పిల్లలు ఉన్నా వెంటనే హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దస్తగిరి, నవీన్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం చేద్దాం

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణంతో క్షేమంగా ఉంటామని, వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్‌లో మద్యం తాగరాదని, ఇన్సూరెన్సు, నంబర్‌ప్లేట్లు ఉండాలని, తదితర విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రోషయ్య, హెచ్‌సీలు బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, రాములు, వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

కొత్తకోట రూరల్: నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ చొరవతో మండలంలోని అమ్మపల్లికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 10 అధునాతన సీసీ కెమెరాలను అమ్మపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన ప్రదేశాలలో కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు షాపుల యాజమాన్యాలు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో నమోదైన చాలా కేసుల్లో సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన జగదేశ్వర్ రెడ్డి, సత్యారెడ్డిని ఎస్పీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు, పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యమాలతోనే సెలవులు సాధించాం’

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లు సమష్టి ఉద్యమాలు నిర్వహించడంతోనే మే నెలలో సెలవులను సాధించుకోగలిగారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా మే నెల మొత్తం సెలవు దినాలుగా ప్రకటించడంతో కేక్ కట్ చేస్తూ మిఠాయిలను పంచిపెట్టారు. సెలవులు ప్రకటించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్నో మార్లు విజ్ఞాపన పత్రాలు అందజేస్తూ టీచర్లు, హెల్పర్లను నిరసనల వైపుకు మళ్లించి సమష్టిగా ఉద్యమాలు చేపట్టామని, దీని ఫలితంగానే సమస్యలు పరిష్కరించుకోగలిగామని, సెలవులు ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో నెలకొన్న అనేక సమస్యలను మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని సమస్యలు పరిష్కారం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మురళి, సుగుణాబాయి, మాధవి, సువర్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం



మానవపాడు మండల నాయకులతో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో శనివారం చర్చించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, ప్రధాన సమస్యలపై నాయకులతో చర్చించారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటినాయుడు, డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్, మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, భరత్ భూషణ్‌రెడ్డి, రామానాయుడు, కృష్ణయ్య, గాండ్ల రమేష్, పరమేష్‌నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరులో శనివారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల నాయకుడు పోతురాజు సోమనాద్రి స్థానిక నాయకులతో కలిసి కూడలిలో పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు నాగరాజు, మద్దిలేటి, రాజ్‌కుమార్, ఉమాపతినాయుడు, అయ్యన్న, బీచుపల్లి, వెంకటేశ్వర్లు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శాంతినగర్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ శనివారం పంపిణీ చేశారు. అలంపూర్ పట్టణానికి చెందిన దేవరపోగు తిమ్మన్నకు రూ.40 వేలు, అరం జ్యోతమ్మకు రూ.61,500 విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప

గట్టు: వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, మందులు పరిశీలించారు. వడదెబ్బ చికిత్సకు సంబంధించిన మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. అదే విధంగా కాన్పుల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నెలవారి ఆరోగ్య పరీక్షలు తప్పని సరిగా చేయించుకునే విధంగా ఏఎన్ఎం, ఆశా వర్కర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న వైద్యాధికారి వెంకటరాజు

ధరూరు: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్య అధికారి వెంకటరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రేవులపల్లి, కాపులకుంట గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు మేత తినకపోవడం, నోటి నుంచి చొంగ కారడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తే గాలికుంటు వ్యాధిగా నిర్ధారించుకొని పశువుల యజమానులు చికిత్స అందించాలన్నారు. రోగం రాక ముందే టీకాలు వేయించుకుని వ్యాధి బారిన పడకుండా పశువులను కాపాడుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 16 నుంచి మే 15వ తేదీ వరకు టీకా పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాఘవేంద్ర, రషీద్, రంగస్వామి పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయమే ప్రధాని మోదీ నిర్ణయం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామాంజనేయులు, తదితరులు

రాజోళి: దేశ ప్రజల అభిప్రాయాలే ప్రధాని మోదీ నిర్ణయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో ఏ ఒక్కరికి ప్రత్యేక ప్రాధాన్యత ఉండదని, అందరూ సమానమేనన్నారు. దేశం కోసం కష్టపడి పని చేసే నాయకుడిగా దేశ ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి మోదీ అన్నారు. కులగణన ద్వారా జరిగే మేలును వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కులగణనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, స్వప్న, తిరుమలేష్, గోవిందు రాజులు, తిరుపతి, జమ్మన్న, మద్దిలేటి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. నేలకొరిగిన స్తంభాలు



మారమునగాల-2లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



మారమునగాలలో రోడ్డుకు అడ్డుగా పడిన విద్యుత్ స్తంభం, చెట్లు

ఉండవెల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు వర్షానికి విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలమట్టమయ్యాయి. మారమునగాల గ్రామంలో విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కన విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దిమ్మె నుంచి కింద పడిపోయాయి. కల్లాల్లో నిల్వ చేసిన మొక్కజొన్న పంట తడిసిముద్దయినట్లు రైతులు వాపోయారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

ఉండవెల్లి: మండలంలోని చిన్నఆముదాలపాడు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆడపడుచులకు ఒడిబియ్యం కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, శివారెడ్డి, సత్యారెడ్డి, కీర్తివర్ధన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, రామకృష్ణ, రైతు సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.